సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 16 । ఆగస్టు । 2025



తప్పిన ప్రమాదం

పొందూరు వద్ద పెను ప్రమాదం తప్పింది. పిల్లలతో ఉన్న ఆటో బోల్తా పడింది.

- 8లో



ఆర్ఎంఓకు అవమానం

రిమ్స్‌లో ఆర్ఎంకు అవమానం జరిగింది. వేదికపైకి పిలవలేదు.

- 8లో



జెండా ఆవిష్కరణ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు. చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

న్యూస్‌రీల్

శాకంబరీదేవిగా కంచమ్మతల్లి



శాకంబరీదేవి అలంకరణలో అమ్మవారు

కంచిలి: కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. భక్తులు ఇచ్చిన వివిధ రకాల కూరగాయలతో దండలు వేసి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

'స్త్రీ శక్తి' ఉచిత బస్సు పథకం ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలోని మహిళలకు 'స్త్రీ శక్తి' పేరుతో అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకం ఒక వరమని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ రెండో డిపో గ్యారేజీ ఆవరణలో నిర్వహించిన సభలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఐదు రకాల బస్సుల్లో (పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ) మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించామన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని అవకాశాలుగా మలుచుకుంటూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. స్త్రీ శక్తి పథకం అమలుకు రాష్ట్రవ్యాప్తంగా 8,450 బస్సులను సిద్ధం చేసినట్లు తెలిపారు. ముందుగా ఆయన శ్రీకాకుళం మండలంలోని సింగుపురం గ్రామంలో జెండా ఆవిష్కరించి, సింగుపురం నుంచి శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలతో కలిసి స్వయంగా ప్రయాణించారు. ప్రయాణం సందర్భంగా మహిళలతో ముచ్చటించిన మంత్రి, జీరో ఫేర్ టికెట్లు స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సహాయ కలెక్టర్ డి. పృథ్వీరాజ్, ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానందం రెడ్డి, ఆర్డీవో సాయి ప్రత్యూష, ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు, 1, 2వ డిపో అసిస్టెంట్ మేనేజర్‌లు సంతోష్‌కుమార్, గంగరాజు, డి.సిలు ఎల్.ఎస్. నాయుడు, ఎడీసీ పి. మురళీధర్, ఎఎస్ఎస్ శ్రీనివాస్, ఆర్టీసీ ఇయూ, ఎస్ఎంయూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెచ్ఎం మృతి



స్వప్న (ఫైల్)

ఆమదాలవలస: మండలంలోని గోపీనగర్‌లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.స్వప్న (45) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. పని ఒత్తిడితోనే ఆమె చనిపోయారని సహోద్యోగులు చర్చించుకుంటున్నారు. బుధవారం విధులకు హాజరైన ఆమెకు అదే రోజు రాత్రి తీవ్ర గుండె నొప్పి రావడంతో రాజాంలో ఉన్న తన కుటుంబ సభ్యులు శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. స్వప్నకు భర్త నాగరాజు, కుమార్తె హనీ ఉన్నారు. భర్త నాగరాజు శ్రీకాకుళం ఎస్‌బీఐ ఏడీబీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తుండగా కుమార్తె ఇంటర్ చదువుతోంది. ఉపాధ్యాయురాలు 2023లో ఆమదాలవలస మండలానికి బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి ఆ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఒకరు వెళ్లిపోగా ఈమె ఒక్కరే పాఠశాలలో ఉన్నారు. పని ఒత్తిడి, యాప్‌లలో నిత్యం అప్‌లోడ్ చేయాల్సిన అంశాలు తదితర విషయాల్లో ఆమె ఒత్తిడికి గురైనట్లు తోటి ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు.

స్వేచ్ఛా గీతిక

పట్ట పగలు మూడు రంగుల వెన్నెల కురిసింది. 'వందేమాతరం' అని విన్న ప్రతి సారీ జనం గుండె ఝల్లుమన్నది. 'జనగణమన' జన గళమున సగర్వంగా పలికింది. జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో పంద్రాగస్టు వేడుకలు అట్టహాసంగా జరిగాయి. విద్యార్థుల ప్రదర్శనలు, శకటాల రాకపోకలు, స్టాళ్ల ఏర్పాటుతో ఉత్సవం ఉత్సాహంగా జరిగింది.

- ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు
- ఆకట్టుకున్న ప్రదర్శనలు



ఆపరేషన్ సింధూర్‌పై విద్యార్థుల ప్రదర్శన

సమరయోధుల స్ఫూర్తితో సంక్షేమం

- మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగస్ఫూర్తితో రాష్ట్రంలో ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, డైరీ అభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ పతాకం ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా అభివృద్ధిపై ప్రసంగించారు. ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నామని, నేటి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. దీపం-2 కింద మొదటి విడతగా 4,35,037 మందికి రూ.33.34 కోట్లు, రెండో విడత కింద 4,08,740 మందికి రూ.36.41 కోట్లు ఖాతాలో జమ చేశామన్నారు. అరసవల్లి రథసప్తమి, కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాలను రాష్ట్ర పండుగలుగా గుర్తించి వైభవంగా జరుపుకున్నామని తెలిపారు. జిల్లా ఏర్పాటై 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలు నిర్వహించుకున్నామని పేర్కొన్నారు. జిల్లా రైతులను వాణిజ్య పంటల వైపు మరల్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. యాంత్రీకరణతో పాటు బిందు, తుంపర సేద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఖరీఫ్-2025కు 1,62,995 హెక్టార్లు సాగు లక్ష్యం కాగా నేటి వరకు 1,28,411 హెక్టార్లలో సాగు చేస్తున్నట్లు తెలిపారు. తీర మత్స్యకార గ్రామాల పథకం కింద మన జిల్లాలో పెదగనగళ్లవానిపేట, ఇద్దివానిపాలెం, దేవునల్తాడ గ్రామాలను ఎంపిక చేసి ఒక్కో గ్రామానికి రూ.2 కోట్ల చొప్పున మంజూరు చేశామని తెలిపారు. 3.10 లక్షల ఆలివ్ రిడ్లే తాబేళ్లను సముద్రంలోకి విడిచిపెట్టామని, తేలినీలాపురం, తేలుకుంచి వంటి కీలక విదేశీ వలస పక్షుల సంరక్షణ కేంద్రాల్లో 5,133 వలస పక్షులను, 2,215 పక్షి పిల్లల గూళ్లను సంరక్షించామన్నారు. జిల్లాలో 11 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంచామని, విజయనగరం, విశాఖ అవసరాలకు కూడా తరలిస్తున్నామని వివరించారు. 2025-26లో ఇప్పటి వరకు రూ.38 కోట్ల పెట్టుబడితో 1231 పరిశ్రమల ద్వారా 4563 మందికి ఉపాధి కల్పించామన్నారు. జిల్లాలో 543 ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి చర్యలు తీసుకొని మెరిట్ లిస్టును కూడా ప్రకటించామని చెప్పారు. జిల్లాలో 2 లక్షల 50 వేల మంది పిల్లలకు తల్లికి వందనం జమచేశామని తెలిపారు. యోగాంధ్ర సందర్భంగా జిల్లాలో 2,72,677 మంది విద్యార్థులు, 11,976 మంది ఉపాధ్యాయులతో కార్యక్రమం నిర్వహించి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డును నెలకొల్పామని గుర్తు చేశారు. జిల్లాలో 3129 గ్రామాల్లో 12,808 చేతి పంపులు ఉండగా 1909 గ్రామాలకు పైప్ లైన్ ద్వారా తాగునీరు అందిస్తున్నామని వివరించారు. జిల్లాలోని మొత్తం 912 గ్రామ పంచాయతీలు బహిరంగ మలవిసర్జన రహిత స్థాయిని చేరుకున్నాయని చెప్పారు. జిల్లాలో 4.41 లక్షల ఉపాధి హామీ వేతనదారులకు ఈ ఏడాది రూ.318 కోట్ల వేతనాలు చెల్లించి వారికి 135 లక్షల పని దినాలు కల్పించి రాష్ట్రంలోనే శ్రీకాకుళం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్, డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట ఎమ్మెల్యేలు గొండు శంకర్ రావు, ఎన్.ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, జిల్లా అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలు అద్భుతః

శ్రీకాకుళం పాతబస్టాండ్, శ్రీకాకుళం పీఎన్ కాలనీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ (పురుషుల) కళాశాల మైదానంలో శుక్రవారం జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పీఎన్ కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు ఆపరేషన్ సింధూర్‌పై నిర్వహించిన ప్రదర్శన అబ్బురపరిచింది. ఆర్‌సీఎం లయోలా విద్యార్థులు ప్రదర్శించిన నమో నమః భారత ప్రదర్శన ప్రేక్షకుల హృదయాలను కదిలించింది. శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన జయతు జయతు భారతం అలరించింది. ఐటీడీఏ పోస్టు మెట్రిక్ హాస్టల్ విద్యార్థుల థింసా నృత్యం, గార కేజీబీవీ విద్యార్థుల నృత్య విన్యాసం ఆకట్టుకున్నాయి. అరసవల్లి బాల సదనం విద్యార్థుల సృజనాత్మక ప్రదర్శన ఆలోచింపజేసింది. వీరిలో న్యూసెంట్రల్ స్కూల్‌కు మొదటి బహుమతి దక్కగా, శ్రీచైతన్య టెక్నో స్కూల్ రెండో బహుమతి, ఆర్‌సీఎం లయోలా, గార కేజీబీవీ విద్యార్థులకు మూడో బహుమతి సంయుక్తంగా లభించాయి. శకటాల ప్రదర్శనలో విద్యాశాఖ శకటానికి మొదటి బహుమతి, వ్యవసాయ శాఖకు రెండో బహుమతి రాగా, మూడో బహుమతిని వైద్య ఆరోగ్యశాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖలు సంయుక్తంగా గెలుచుకున్నాయి. స్టాల్స్ ఆకట్టుకున్నాయి.





దేశభక్తి గీతాలకు విద్యార్థులు నృత్య విన్యాసాలు



మొదటి బహుమతి గెలుచుకున్న విద్యాశాఖ శకటం



ద్వితీయ బహుమతి గెలుచుకున్న వ్యవసాయశాఖ శకటం





మూడో బహుమతి గ్రామీణ నీటిసరఫరా, వైద్య ఆరోగ్యశాఖ శకటాలు

కంది.. అందేనా..?



- రేషన్ షాపుల్లో పంపిణీ నిల్
- ఎక్కడా సరఫరా కాని వైనం

హిరమండలం: రేషన్ దుకాణాల్లో కందిపప్పు ఇవ్వడం మానేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా కందిపప్పు సరఫరాను పునరుద్ధరించ లేదు. గత ప్రభుత్వ హయాంలో నిరంతరం కందిపప్పు పంపిణీ జరిగేదని, అయితే ప్రస్తుతం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని నెలలు మాత్రమే ఇచ్చిందని, ఇప్పుడు అది కూడా ఇవ్వడం లేదని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 1603 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. వాటి పరిధిలో 6,57,758 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 19,60,651 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరంతా ప్రతి నెలా రేషన్ షాపుల్లో ఇచ్చే కందిపప్పు కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. కందిపప్పు గురించి సమాధానం చెప్పేవారే కరువైపోయారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.120 నుంచి రూ.140 వరకు పలుకుతోంది. కొన్ని చోట్ల తక్కువ ధరకు విక్రయిస్తున్నా.. రేషన్ పంపిణీలో భాగంగా ఇస్తే తమకు అనుకూలంగా ఉంటుందని కార్డుదారులు కోరుతున్నారు.



పప్పు సరఫరా చేయాలి

ఎన్నికల ముందు అన్ని సరుకులు రేషన్ షాపుల్లో ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ప్లేటు ఫిరాయించారు. మా లాంటి పేదలకు అవసరమైన కందిపప్పు సరఫరా చేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

– దీర్ఘాశి చిన్నమ్మడు, పాతహిరమండలం



కంది పప్పు లేదట

రేషన్ షాపుల్లో బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. కంది పప్పు అడిగితే ప్రభుత్వం నుంచి రాలేదని డీలర్లు చెబుతున్నారు. గతంలో రేషన్ షాపులలో రూ.70 లకే కందిపప్పు ఇచ్చేవారు.

– గులివిందల లలిత, తంప గ్రామం

అదిరిన ఆట.. కుదిరిన పాట



ఉర్రూతలూగించిన రామ్ పాట

- ఉత్సాహంగా వజ్రోత్సవాలు
- చివరి రోజు ఆద్యంతం అలరించిన కార్యక్రమాలు

శ్రీకాకుళం కల్చరల్: టీజే టిల్లు అంటూ రామ్ రఫ్ఫాడిస్తే.. సిక్కోలు సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ రఘుపాత్రుని వారు ఉర్రూతలూగించారు. అపురూప నాట్య విన్యాసంతో నీరజ బృంద సభ్యులు నీరాజనాలు అందుకున్నారు. జిల్లా వజ్రోత్సవాలు చివరి రోజు ఆట అదిరిపోగా.. పాట అందంగా కుదిరింది. జిల్లా ఆవిర్భావం సందర్భంగా నిర్వహించిన వజ్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో జరిగిన ఈ వేడుకల్లో ప్రముఖ గాయకుడు రామ్ మిరియాల ఆధ్వర్యంలో జరిగిన పాట కచేరీ ఉర్రూతలూగించింది. నృత్యదర్శకురాలు నీరజా సుబ్రహ్మణ్యం శిష్యులతో నేనే శ్రీకాకుళం నృత్యం కనువిందు చేసింది. అలాగే నాట్యగురువు రఘుపాత్రుని శ్రీకాంత్ నేతృత్వంలో 75 మంది సభ్యులు జిల్లా సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే గీతాలకు నాట్యం చేశారు. సిక్కోలు వైభవాన్ని తెలియజేసే వజ్రోత్సవ సంచిక పుస్తకాన్ని మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ జిల్లాకు గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు తీసుకురానున్నట్లు తెలిపారు.

జిల్లా లోగో ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: 75 ఏళ్ల శ్రీకాకుళం జిల్లా ఆవిర్భావం సందర్భంగా ఏర్పాటు చేసిన లోగోను మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ మహేశ్వరరెడ్డి తదితరులు ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు చెందిన కరుకోల రాజన్న భార్య కరుకోల జయలక్ష్మి, మంత్రి అప్పలరామయ్య కుమారుడు నర్సింహమూర్తి, గరిమెళ్ల సత్యనారాయణ వారసులు యారబంట్ల లక్ష్మణరావులను సత్కరించారు.



శ్రీకాంత్ బృందం నృత్య ప్రదర్శన

ఇంత నీచానికి దిగజారుతారా..?



పొందూరు కేజీబీవీ ఎస్‌ఓ సౌమ్యను పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

- ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వైఖరిపై వైఎస్సార్‌సీపీ నేత చింతాడ మండిపాటు
- కూన బాధితురాలు సౌమ్యకు పరామర్శ
- బాధితులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా

ఆమదాలవలస: పొందూరు కేజీబీవీ ఎస్‌ఓ (ప్రిన్సిపాల్) సౌమ్యను ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధించడం సబబు కాదని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆయన శుక్రవారం శ్రీకాకుళంలో ఉన్న ఆమె గృహానికి వెళ్లి పరామర్శించారు. కూన రవికుమార్ చేసిన దాష్టీకాలను ఆమె చెప్పుకున్నారని, ఎంత నరకం చూడకపోతే ఇలా బయటకు వచ్చి చెబుతారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి 11.30 గంటల వరకు ఆఫీస్‌లో ఉంచడం, రాత్రి సమయంలో వీడియో కాల్ చేసి మాట్లాడాల్సిన అవసరం ఎమ్మెల్యేకు ఏం ఉందని ప్రశ్నించారు. ఇలాంటి పనులు చేస్తే కూనకు తగిన బుద్ధి చెబుతామన్నారు. వైఎస్సార్ సీపీ మొత్తం ఉద్యోగినికి అండగా ఉంటుందని తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి ఆమెకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామన్నారు. గతంలో కూడా కూన రవికుమార్‌పై ఇలాంటి అభియోగాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఆయన కోరుకున్నది జరగకపోతే ఉద్యోగులను బదిలీలు చేసే కూన నీచ బుద్ధికి సాక్ష్యాలు ఉన్నాయన్నారు.



కేంద్ర, రాష్ట్ర మంత్రుల చేతులమీదుగా కళాకారుడు యడ్ల గోపాలరావుకు సత్కారం



విశిష్టులకు ఘన సన్మానం

వజ్రోత్సవాల సందర్భంగా జిల్లా అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రముఖులకు గౌరవ సత్కారాలు చేశారు. సాహిత్యం, క్రీడలు, కళలు, పరిపాలన, సేవా రంగం వంటి విభిన్న విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 23 మంది ప్రముఖులను సత్కరించారు.

– శ్రీకాకుళం కల్చరల్

స్వతంత్ర శ్రీకాకుళం

సత్కారం అందుకున్నవారిలో కళారంగంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్ల గోపాలరావు, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఎన్.అప్పన్న, కల్నల్ మద్దు చంద్రశేఖరరావు, మాజీ డీజీపీ హెచ్‌జే దొర, టీటీడీ మాజీ అధికారి రుంకు అప్పారావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి హనుమంతు అరుణ్‌కుమార్, యువజన సేవా రంగంలో ప్రసాదరావు(బెజ్జిపురం యూత్‌క్లబ్), హస్తకళలలో దివిలి అప్పారావు, పొందూరు ఖాదీ సొసైటీకి చెందిన జల్లేపల్లి కాంతమ్మ, సైకత శిల్పి తరుణి ప్రసాద్ మిశ్రో, 9 నంది అవార్డులు గెలుచుకున్న డాక్టర్ మీగడ రామలింగస్వామి, మిమిక్రీ ఆర్టిస్టు ఎల్.నందికేశ్వరరావు, హోటల్ నాగావళి యజమాని వరదా కొండబాబు, అరబిందో సంస్థ ప్రతినిధి రవినాథ్ శెట్టి, మాజీ ఎమ్మెల్యేలు తలే భద్రయ్య, బగ్గు లక్ష్మణరావు, లంక ప్రసాదరావు, వావిలిపల్లి జగన్నాథం నాయుడు, కె.అప్పలనరసింహ భుక్త, పల్లి నాగభూషణరావు (జానపద కళలు), సివిల్స్ విజేత వెంకటేష్, జీడి వ్యాపారవేత్తలు కోరాడ సంతోష్‌కుమార్, మల్లా శ్రీనివాసరావు ఉన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వరరావు. చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యేలు

జె.కైలాసరావు ఎస్‌ఏ, ఎస్.రామారావు ఎస్‌జీటీ, బి.విజయభారతి హెచ్‌ఎం, ఈఎస్ అనిత సీనియర్ అసిస్టెంట్, ఎస్.శేఖర్ జైక్వాండో కోచ్

మంత్రి వెంకటస్వామి, కె.నక్షత్ర, పి.ఇందు, ఎం.మేఘరాజు, ప్రియాంక, జి.శ్రావణి, ఎస్.రాధ

● ప్రతిభకు ప్రశంసలు

శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు) మైదానంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా అవార్డులు అందజేశారు.

– శ్రీకాకుళం పీఎన్‌కాలనీ/ శ్రీకాకుళం పాతబస్టాండ్

క్లుప్తంగా

తప్పిన పెను ప్రమాదం



రహదారిపై ఒరిగిన స్కూల్ ఆటో

పొందూరు : మండల కేంద్రంలోని పొందూరులో మానసవేణి పాఠశాల విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటో శుక్రవారం ప్రమాదానికి గురైంది. 20 మందికి పైగా విద్యార్థులను ఎక్కించడంతో ఒరిగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. బోల్తా కొట్టుంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని అంటున్నారు.

పుస్తెలతాడు చోరీ

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం నరసాపురం జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం ఓ మహిళ మెడలో పుస్తెలతాడును దుండగులు తెంచుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతబొమ్మాళి మండలం బడేకుప్పన్నపేటకు చెందిన బొమ్మాళి దాలమ్మ కోటబొమ్మాళిలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడు తెంచుకుని పరారయ్యారు. బాధితురాలు కోటబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

20 కేజీల గంజాయి స్వాధీనం



పట్టుబడిన నిందితులతో పోలీసులు

పలాస: ఒడిశాకు చెందిన నలుగురు గంజాయి అక్రమ రవాణాదారులను పలాస రైల్వే స్టేషన్‌లో అరెస్టు చేసినట్టు కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. నిందితులు మోహనా బ్లాక్ పడొవ గ్రామానికి చెందిన అని సెంటు నాయక్ , రాహిత్ బిర, జున్నైలు, గుమ్మా గ్రామానికి చెందిన సురుసింగ్‌గా గుర్తించామని, వీరి వద్ద 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వీరిని అరెస్టు చేసి పలాస కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో జైలుకు పంపించామన్నారు.

చిన్నారులకు మాజీ సైనికుల చేయూత



చిన్నారులకు పాస్‌బుక్‌లు అందిస్తున్న మాజీ సైనికులు

శ్రీకాకుళం కల్చరల్ : ఇటీవల నరసన్నపేట మండలం దేవాది గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు చిన్నారులు మోహిని, యోగితలకు మాజీ సైనికులు, వీరనారీమణులు అండగా నిలిచారు. చిన్నారులు ప్రస్తుతం అమ్మమ్మ, తాతయ్యల సంరక్షణలో ఉన్నారని తెలుసుకుని స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా తమ వంతు సాయంగా రూ.1,02,232 సేకరించి ఇరువురి పేరిట సుకన్య ఖాతాలను తెరిచి పాస్ పుస్తకాలను శుక్రవారం అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు కటకం మాట్లాడుతూ సమాజాహితాన్ని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ పైడి రాజా మాజీ సైనికులు, వీరనారీమణులకు వాటర్ డిస్పెన్సర్‌ను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత కెప్టెన్ పి.ఈశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ వి.సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ పి.మురళీధరరావు, తర్ల కృష్ణారావు, ఎస్.రామకృష్ణ, ఎం.సింహాచలం, కె.కన్నారావు, పైడి విశ్వేశ్వరరావు, క్యాంటీన్ మేనేజర్ పప్పల గోవిందరావు, సభ్యులు బి.రాంబాబు, డి.వాసుదేవరావు, పి.శ్రీనివాసరావు, జి.రామారావు, డి.వరాహ నరసింహులు, ఎస్.లక్ష్మీనారాయణ, ఎం.రాములు, ఎ.వి.జగన్మోహన్‌రావు, కె.అప్పారావు, సీహెచ్.రామారావు, నాగభూషణరావు, అప్పలసూరి, శ్రీను, సురేష్, నారాయణ, వీరనారీమణులు కె.జగ్గమ్మ, జి.అమ్మన్నమ్మ, పి.పద్మావతి, ఎ.లక్ష్మీ, పి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై వినతి

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కార్పొరేషన్ ద్వారా జీతాలు చెల్లించాలని ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళం ఆర్టీసీ రెండవ డిపో గ్యారేజీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.బాబూరావు, టి.ముత్యాలరావు, జిల్లా అధ్యక్షులు దాసరి కిరణ్, ట్రెజరర్ నవీన్, డిపో కార్మికులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసులకు రాష్ట్ర అవార్డులు



రాష్ట్ర కమిషనర్, ఈడీలు నితీష్‌కుమార్, రాహుల్‌దేవ్ శర్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న జిల్లా ఎక్సైజ్ కమిషనర్ పి.రామచంద్రరావు



రాష్ట్ర అవార్డులు దక్కించుకున్న జిల్లా ఎక్సైజ్ పోలీసులతో అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ విభాగానికి చెందిన ఏడుగురు పోలీసులకు 79వ స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో అవార్డులు దక్కాయి. మంగళగిరి కార్యాలయంలో రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ నితీష్‌కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈడీ) రాహుల్‌దేవ్ శర్మ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావుకు అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందించి అభినందనలు తెలిపారు.

ఆయనతో పాటు సోంపేట, పాతపట్నం ఇన్‌స్పెక్టర్లు జి.వి.రమణ, కె.కృష్ణారావు, ఆఫీస్ సూపరింటెండెంట్ వి.రవిశేఖరరావు, ఎస్ఐ జె.సుజాత, కానిస్టేబుళ్లు పి.రమణ, బి.విఠలేశ్వరరావుకు అవార్డులు దక్కాయి.

ఆర్‌ఎంఓకు అవమానం!

● రిమ్స్ జెండా వందనంలో వేదికపైకి పిలవని వైనం
● మనస్థాపనతో వెళ్లిపోయిన ఆర్‌ఎంఓ
● మద్దతుగా వేదిక దిగిపోయిన డిప్యూటీ ఆర్‌ఎంవో

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ సర్వజన ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన జెండా వందనం కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ భానుప్రకాష్ తీవ్ర అవమానానికి గురయ్యారు. జెండా వందనం పూర్తయిన తర్వాత వైద్యులు సిబ్బందికి ప్రశంసాపత్రాలు ఇచ్చేందుకు సూపరింటెండెంట్ అడ్మినిస్ట్రేటర్‌తో పాటు డిప్యూటీ ఆర్‌ఎంఓను వేదికపైకి పిలిచారు. అక్కడే ఉన్న ఆర్‌ఎంవోను మాత్రం వేదికపైకి పిలవలేదు. దీంతో మనస్థాపానికి గురైన ఆర్‌ఎంఓ సభా ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు. ఆయన ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. సీఎస్ ఆర్‌ఎంఓగా పనిచేస్తున్న డాక్టర్ సుభాషిని సెలవులో ఉండడంతో ఆ పోస్టులో కూడా డాక్టర్ భానుప్రకాష్ ఇన్చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంత కీలక బాధ్యతలు ఉన్న వ్యక్తిని వేదికపైకి ఆహ్వానించకపోవడానికి ఓ అధికారి కారణమని తెలుస్తోంది. ఆయనను వేదిక పైకి ఆహ్వానించాలని వైద్యులు, ఇతర ఉద్యోగులు బహిరంగంగానే చెబుతున్నా పెడ చెవిన పెట్టి కార్యక్రమాన్ని ప్రారంభించేశారు. ఇంతలో డాక్టర్ భానుప్రకాష్‌కు ప్రశంసాపత్రం ప్రకటించారు. దానిని తీసుకోకుండానే భానుప్రకాష్ వెళ్లిపోయారు. తనకంటే పైఅధికారిని వేదికపైకి ఆహ్వానించకుండా అవమానపరిచారని భావించిన డిప్యూటీ ఆర్‌ఎంవో డాక్టర్ సి.పి.శ్రీదేవి సైతం వేదికపై నుంచి దిగి వెళ్లిపోయారు.


దిగువ స్థాయి ఉద్యోగుల ఆవేదన..

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రిమ్స్‌లో పని చేస్తున్న దిగు స్థాయి ఉద్యోగుల సేవలను సైతం గుర్తించి అవార్డులు ఇవ్వడం పరిపాటి. ఈ ఏడాది ఎఫ్ఎన్‌ఓ, ఎంఎన్‌ఓ ,సెక్యూరిటీ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందితో పాటు పలువురు దిగువ స్థాయి సిబ్బందికి అవార్డులను ఇవ్వలేదు. వీరికి ఇస్తే న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయని ఓ అధికారి చెప్పడం గమనార్హం.

జూనియర్‌కు సిఫార్సు పట్ల సీనియర్ల ఆవేదన..

రిమ్స్‌లో ఐదేళ్ల లోపు సర్వీసు ఉన్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ క్యాడర్ వైద్యురాలు జయలక్ష్మికి జిల్లా స్థాయిలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో అవార్డుకు అధికారులు సిఫార్సు చేయడాన్ని సీనియర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమె సాధారణ సేవలు కాకుండా కేవలం ఆరోగ్యశ్రీ రోగులకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తున్నారు. అది కూడా రెండు నెలల నుంచి మాత్రమే పూర్తి బాధ్యతలతో చేస్తున్నారు. ఇటువంటి జూనియర్‌కు అవార్డుకు సిఫార్సు చేయడం వెనుక అడ్మినిస్ట్రేటర్ ఒత్తిడి సూపరిండెంట్ డాక్టర్ అమూల్యపై ఉందని సీనియర్ వైద్యులు ఆరోపిస్తున్నారు. ఆయన ఏది చెప్తే అదే సూపరింటెండెంట్ చేస్తారన్న వాదన వినిపిస్తున్నారు. రిమ్స్‌లో ఇటీవల క్లిష్టతరమైన వైద్య సేవలను అందించి సీతంపేటకు చెందిన ఓ రోగిని బతికించిన సంగతి తెలిసిందే. అలాగే న్యూరాలజీ విభాగంలో ఇప్పటివరకు వందకు పైగా అత్యంత కీలకమైన శస్త్ర చికిత్సలు జరిపిన వైద్యులు, ఆర్థోపెడిక్ విభాగంలో కీళ్ల మార్పిడి, తుంటి శాస్త్ర చికిత్స వంటి క్లిష్టతరమైన ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసిన వైద్యాధికారులు ఎందరో ఉన్నారు. వీరినీ కాదని రెండు నెలలుగా ఆరోగ్యశ్రీలో సేవలను మాత్రమే గుర్తించి అవార్డుకు సిఫార్సు చేయాలని సూపరిండెంట్‌పై ఒత్తిడి తేవడం పట్ల సీనియర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు దుర్యోధన

పలాస: మోదుగులపుట్టి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ శుక్రవారం చెప్పారు. నందిగాం మండలం జడ్యాడ గ్రామానికి చెందిన కంబకాయల దుర్యోధన టెక్కలిపట్నం బజారుకు వెళ్లి తిరిగి వస్తుండగా మోదుగులపుట్టి వద్ద వెనుక నుంచి వచ్చిన బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బలమైన గాయాలు కావడంతో కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా మృతి చెందాడు. దుర్యోధన కుమారుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

సూర్యఘర్ ప్రగతికి అవార్డులు



డిప్యూటీ ఈఈ వెంకటేశ్వరరావు, ఏఈ సురేష్‌కుమార్‌లకు అవార్డు అందజేస్తున్న సీఎండీ

అరసవల్లి: పీఎం సూర్యఘర్ పథకం అమలులో శ్రీకాకుళం డివిజన్ ఉత్తమ ప్రగతి సాధించినందుకు గాను తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్) ఉత్తమ అవార్డులు ప్రకటించింది. శ్రీకాకుళం డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ పైడి యోగీశ్వరరావు, డిప్యూటీ ఈఈ చల్లా వెంకటేశ్వరరావు, డీ-1 ఏఈ సురేష్ కుమార్‌లు శుక్రవారం విశాఖ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో సీఎండీ పృథ్వీతేజ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.